సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

శుక్రవారం । 20 । డిసెంబర్ । 2024




పథకాల అమల్లో సమష్టి కృషి

పథకాల అమలులో చురుకైన పాత్ర పోషించాలని రాష్ట్ర పీఆర్‌, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణతేజ పిలుపునిచ్చారు. 8లో



ఏజెన్సీలో మెరుగైన వైద్య సేవలు

మెరుగైన వైద్య సేవలు అందించాలని ఏపీ మెడికల్ అండ్ హెల్త్, హెల్త్‌వెల్ అవేర్నెస్ రాష్ట్ర బృందం సభ్యుడు సుబ్రహ్మణ్యం సూచించారు. 8లో



పెద్దేరుకు వరద తాకిడి

అనకాపల్లి జిల్లా మాడుగుల మండలంలోని పెద్దేరు జలాశయానికి వరద తాకిడి నెలకొంది. 129 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

కొత్త వంగడాలకు రాజ్‌మార్గం

'ప్రకృతి' పంటకు మంచి రోజులు

జిల్లాలో ప్రకృతి పంటగా గుర్తింపు పొందిన రాజ్‌మాకు మంచి రోజులు రానున్నాయి. ఈ పైరును సాగు చేసే రైతులకు అధిక దిగుబడి నిచ్చే మేలైన వంగడాలను అందించాలన్న లక్ష్యంతో స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో విస్తృతంగా పరిశోధనలు జరుగుతున్నాయి. ఇప్పటివరకు గిరిజన రైతులు సంప్రదాయ విత్తనాలను వినియోగిస్తున్నారు. ఇవి శాస్త్రీయంగా సిఫార్సు చేసినవి కాకపోవడంతో దిగుబడులు అంతంత మాత్రంగా ఉంటున్నాయి. ఈ పరిస్థితుల్లో కాన్పూర్ వ్యవసాయ పరిశోధన స్థానం నుంచి తీసుకువచ్చిన ఐదు రకాలపై పరిశోధనలు చేస్తున్నారు.



ఆర్‌ఏఆర్‌ఎస్‌లో పరిశోధన నిమిత్తం చేపట్టిన రాజ్‌మా సాగు



రాజ్‌మా ఉత్కర్ష్‌లో అధిక దిగుబడి



చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానం

- చింతపల్లి ఆర్‌ఏఆర్‌ఎస్‌లో రాజ్‌మాపై విస్తృత పరిశోధనలు
- కాన్పూర్ పరిశోధన స్థానం నుంచి తీసుకువచ్చిన శాస్త్రవేత్తలు
- ఏజెన్సీ వాతావరణానికి అనువైనవిగా ప్రాథమికంగా గుర్తింపు
- మంచి దిగుబడి ఇస్తున్న 'ఉత్కర్ష్'

చింతపల్లి: జిల్లాలో రాజ్‌మా సాగు చేసే రైతులకు మేలైన వంగడాలు అందించేందుకు స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనలో విస్తృత పరిశోధనలు జరుగుతున్నాయి. జిల్లాలో వరి, చిరుధాన్యాలు తరువాత రాజ్‌మాను 12 వేల హెక్టార్లలో సాగు చేస్తున్నారు. తేమ, మంచును గ్రహించి మంచి దిగుబడినిచ్చే ప్రకృతి వంటగా రాజ్‌మాకు గుర్తింపు ఉంది. మంచి ఆదాయ వనరు అయినప్పటికీ సంప్రదాయ విత్తనాలు వినియోగించడం వల్ల దిగుబడి అంతంతమాత్రంగానే ఉంటోంది. శాస్త్రీయమైన వంగడాలు కానందున గిరి రైతులు ఆదాయం కోల్పోతున్నారు. ఈ పరిస్థితుల్లో అధిక దిగుబడినిచ్చే వంగడాలు అందించేందుకు స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో శాస్త్రవేత్తలు విశేష కృషి చేస్తున్నారు. దీనిలో భాగంగా మూల విత్తనం రూపొందించే పరిశోధనల్లో వారు నిమగ్నమయ్యారు. ఈ పరిశోధనలు ఫలవంతం అయితే ఏడాదికి రెండు పంటలు పండే రాజ్‌మా రకాలు అందుబాటులోకి వస్తాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. దీనివల్ల ఏడాదిలో ఆగస్టు, డిసెంబర్‌లో సాగు చేసే అవకాశం ఉంటుందని వారు పేర్కొంటున్నారు.

కాన్పూర్ రకాలివీ..

స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో అరుణ్ ఐపీఆర్ 98-3-1, ఉదయ్ పీడీఆర్-14, ఉత్కర్ష్ ఐపీఆర్ 98-6, అంబర్ ఐపీఆర్ 96-6 రకాలను కాన్పూర్ నుంచి తీసుకువచ్చి పరిశోధనలు చేస్తున్నట్టు శాస్త్రవేత్తలు తెలిపారు. ఇప్పటివరకు జరిగిన పరిశోధనల్లో స్థానిక రకాలకన్నా దిగుబడి బాగున్నట్టు వారు గుర్తించారు.

- అరుణ్ ఐపీఆర్ 98-3-1 రకం 120 రోజులు పంటకాలం, ఉదయ్ పీడీఆర్-14 రకం 115 రోజుల పంటకాలం, ఉత్కర్ష్ ఐపీఆర్ 98-6 రకం 125 రోజుల పంటకాలం, అంబర్ ఐపీఆర్ 96-6 రకం 134 రోజుల్లో దిగుబడి వస్తున్నట్టు ప్రాథమికంగా గుర్తించారు. వీటి నిర్ధారణకు సుమారు 6 నుంచి ఏడు సంవత్సరాల వరకు సమయం పడుతుందని శాస్త్రవేత్తలు తెలిపారు. ప్రస్తుతం గిరిజనులు స్థానికంగా రాజ్‌మా రెడ్ రకాన్ని సాగు చేస్తున్నారు. కేవలం 3 నుంచి 4 క్వింటాళ్ల మాత్రమే దిగుబడి వస్తోంది. ప్రస్తుతం పరిశోధన జరుగుతున్న రకాలు అంతకుమించి దిగుబడి వస్తున్నట్టు శాస్త్రవేత్తలు గుర్తించారు. అరుణ్ ఐపీఆర్ 98-3-1, ఉదయ్ పీడీఆర్-14 రకాలు ఎకరాకు 4 నుంచి ఐదు క్వింటాళ్లు, ఉత్కర్ష్ ఐపీఆర్ 98-6 రకం మాత్రం ఎకరాకు ఐదు నుంచి ఆరు క్వింటాళ్ల దిగుబడి రావడాన్ని వారు గమనించారు.



పరిశోధన స్థానంలో రాజ్‌మా దిగుబడి

ఐదు రకాలపై పరిశోధనలు



ఏజెన్సీలో రాజ్‌మా సాగు చేస్తున్న గిరిజన రైతులు సంప్రదాయ విత్తనాలైన తెలుపు, ఎరుపు రకాలను మాత్రమే వినియోగిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో వారికి మేలైన వంగడాలను అందించాలన్న లక్ష్యంతో కాన్పూర్ పరిశోధన స్థానం నుంచి అరుణ్, ఉదయ్, ఉత్కర్ష్, అంబర్, జ్వాలా వంటి రకాలను తీసుకువచ్చి పరిశోధనలు చేస్తున్నాం. వీటిలో అధిక దిగుబడి ఇచ్చే రకానికి అల్లూరి పేరు పెట్టే ఆలోచన ఉంది.

– డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి, ఏడీఆర్,చింతపల్లి

అనుమతుల కోసం ఎదురుచూపు

చింతపల్లి కేంద్రంగా రాజ్‌మా విత్తనోత్పత్తి ప్రాజెక్టుకు అనుమతులు కోరుతూ గతంలో వర్సిటీ అధికారులకు చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం నుంచి ప్రతిపాదనలు వెళ్లింది. కొన్ని సాంకేతిక ఇబ్బందులు కారణంగా అమలు కాలేదు. అయినప్పటికీ గిరి రైతులకు మేలైన వంగడాలను అందించాలన్న లక్ష్యంతో కొత్త రకాలపై పరిశోధనలు జరుగుతున్నాయి.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల జిల్లా అధ్యక్షుల నియామకం

విశాఖ సిటీ: అల్లూరి సీతారామరాజు జిల్లా వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులను ఆ పార్టీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియామకాలు చేపట్టినట్లు కేంద్ర కార్యాలయం గురువారం ప్రకటించింది. మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలుగా కురుసు పార్వతమ్మ నియమితులయ్యారు. యూత్ వింగ్ అధ్యక్షుడిగా గబ్బాడ శేఖర్, ఎస్సీ సెల్‌కు చిందాడ అప్పారావు, క్రిస్టియన్ మైనారిటీ సెల్‌కు వి.తిమోతి, వలంటీర్ల వింగ్‌కు కె.రాంబాబు, కల్చరల్ వింగ్‌కు కె.రఘునాథ్, పబ్లిసిటీ వింగ్‌కు డి.బాపూజీ, ఎంప్లాయిస్ అండ్ పెన్షనర్ల వింగ్‌కు లకే కృష్ణారావు మజ్జి నియమితులయ్యారు. జిల్లా రైతు విభాగం అధ్యక్షుడిగా అరకు నియోజకవర్గానికి చెందిన బాకూరు సదాశివరాజు నియమితులయ్యారు. అలాగే పంచాయతీరాజ్ వింగ్‌కు డి.డానియల్, గ్రీవెన్స్ సెల్‌కు పి.సుక్ర, వీవర్స్ వింగ్‌కు కందివలస కుమార్, వైఎస్సార్‌టీయూసీకి జి.రామ్‌ప్రసాద్, అంగన్‌వాడీ వింగ్‌కు జి.సుశీల, ఇంటలెక్చువల్ ఫోరంకు కె.రాజారమేష్‌బోస్‌ను నియమించినట్టు పార్టీ కేంద్ర కార్యాలయం పేర్కొంది.

నాణ్యమైన భోజనం, విద్య అందించాలి

- అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

హుకుంపేట: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింం సూచించారు. గురువారం స్థానిక ట్రైబల్ వెల్ఫేర్ ఆంగ్ల మీడియం బాలికల పాఠశాల, కేజీబీవీ పాఠశాలను ఆయన సందర్శించారు. ముందుగా విద్యార్థులకు బోధించారు. అనంతరం రికార్డులు, మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు.

న్యూస్‌రీల్

కాఫీ పండ్ల కొనుగోలు ధర పెంపు

- మాతోట సీఈవో చిన్నారావు

చింతపల్లి: కాఫీ పండ్లను రైతుల నుంచి ప్రభుత్వం ప్రకటించిన దానికంటే ఎక్కువ ధరకు కొనుగోలు చేస్తామని మాతోట సీఈవో వనపల చిన్నారావు తెలిపారు. ఇప్పటికే కాఫీ పండ్లను కిలో రూ. 45కు కొనుగోలు చేస్తుండగా మరో రూ.5 పెంచి రూ.50 లకు కొనుగోలు చేయడానికి తమ సంస్థ డైరెక్టర్లు నిర్ణయించారని ఆయన తెలిపారు. మంచి నాణ్యత గల పండ్లను తమ సంస్థ వద్దకు తీసుకు వచ్చి విక్రయించగలిగితే కిలోకు రూ.60 చెల్లిస్తామని తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ప్రకటించిన ధరలను దృష్టిలో పెట్టుకుని ఈ ధరలను తమ సంస్థ ప్రకటించిందన్నారు. మాతో పాటు గిరిజన వికాస్, ఆంధ్రా కశ్మీర్ ఎఫ్‌పీవోలు ఈ ధరలకు రైతుల నుంచి కొనుగోలు చేసేందుకు ముందుకు వచ్చినట్టు చిన్నారావు తెలిపారు.

ఆశాలతో వెట్టి చాకిరీ

- విమర్శలకు తావిస్తున్న హెచ్‌వీ తీరు



కించుమండ సబ్ సెంటర్‌లో మట్టి పనులు చేస్తున్న ఆశా కార్యకర్తలు

డుంబ్రిగుడ: మండలంలోని కించుమండ సబ్ సెంటర్‌లో గురువారం ఆశా కార్యకర్తలతో మట్టి పనులు చేయించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పాడేరు- అరకు జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ఈ సబ్ సెంటర్‌లో మట్టి పనులు చేస్తూ కనిపించారు. సబ్‌సెంటర్‌కు వచ్చిన వారితో హెచ్‌వీ పలుగు, పారలతో తుప్పలు, చెత్త తొలగింపు పనులు చేయించారు. ఈ వ్యవహారంపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని గిరిజన సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

- రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం



పీహెచ్‌సీలో వైద్యులతో మాట్లాడుతున్న పీవో సింహాచలం

రంపచోడవరం: ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు వెంటనే వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేయాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం ఆదేశించారు. మండలంలోని సీతపల్లి, పెద్దగెద్దాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆయన సందర్శించారు. అన్ని రకాల మందులు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. రోగులకు సేవలందించేందుకు వైద్యులు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఏజెన్సీలో సీజనల్ వ్యాధులు రాకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని వైద్యాధికారులను ఆదేశించారు. ఏజెన్సీలో మలేరియా, డెంగ్యూ జ్వరాలు రాకుండా రక్త పరీక్షలు నిర్వహించాలని పీవో సూచించారు.

కాఫీ ఫలసాయాన్ని జీసీసీకి విక్రయించాలి

- పాడేరు డీఎం సింహాచలం



పెదగూడలో కాఫీ కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న జీసీసీ డీఎం సింహాచలం

ముంచంగిపుట్టు: గిరిజన సహకార సంస్థకు మాత్రమే కాఫీ ఫలసాయాన్ని విక్రయించాలని పాడేరు జీసీసీ డీఎం డి.సింహాచలం అన్నారు. మండలంలోని పెదగూడ కాఫీ కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన పరిశీలించారు. కాఫీ రైతులతో మాట్లాడారు. కాఫీ కొనుగోలు, నాణ్యతలపై వారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాఫీ రకాన్ని బట్టి గతేడాది కన్నా అధిక ధర నిర్ణయించినట్టు తెలిపారు. అరెబికా పార్చ్‌మెంట్ రకానికి రూ.285, అరెబిక్ చెర్రీ రకానికి రూ.150, రొబస్తా చెర్రిరకానికి రూ.80 చొప్పున ఇంటి వద్దనే తమ సిబ్బంది కొనుగోలు చేస్తున్నట్టు చెప్పారు. వారి వ్యక్తిగత ఖాతాల్లో 24 గంటల్లో నగదు జమ అవుతుందని ఆయన పేర్కొన్నారు.

మారుమూల గ్రామాలకు రోడ్ల నిర్మాణం

- కలెక్టర్ దినేష్‌కుమార్
- వేగవంతం చేయాలని ఆదేశం

సాక్షి,పాడేరు: జిల్లాలోని మారుమూల గ్రామాలకు రోడ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ఐటీడీఏ పీవోలు, పలు ఇంజనీరింగ్‌శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వామపక్ష తీవ్రవాద ప్రభావిత ప్రాంతాలకు మంజూరు చేసిన రోడ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని సూచించారు.పాడేరు డివిజన్‌లో 29 రహదారులు, వంతెనల పనులు మంజూరు చేశామన్నారు. వీటిలో పదింటికి అటవీశాఖ అభ్యంతరాలు ఏర్పడడంతో అశాఖ ఉన్నతాధికారులకు లేఖ రాసి అనుమతులు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో రంపచోడవరం, చింతూరు ఐటీడీఏ పీవోలు సింహాచలం, అపూర్వభరత్, పంచాయతీరాజ్ డీఈఈలు రవికుమార్, రవి, ఐటీడీఏ ఏవో హేమలత పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

సెల్ టవర్ల నిర్మాణం..

జిల్లాలో సెల్ టవర్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ నుంచి ఐటీడీఏ పీవోలు, సబ్ కలెక్టర్లు, అటవీశాఖతో పాటు పలు నెట్‌వర్క్ సంస్థల అధికారులతో వీడియో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెల్ టవర్ల నిర్మాణానికి సమగ్రమైన సర్వే చేసి జిల్లా స్థాయి కమిటీలో చర్చించిన తరువాత అనుమతులు జారీ చేస్తామన్నారు. ఎయిర్‌టెల్ టవర్లు 139కుగాను 136 టవర్లకు రేడియేషన్ అమలులో ఉందని, మిగిలిన టవర్ల పనులు వేగవంతం చేయాలన్నారు. బీఎస్‌ఎన్‌ఎల్ 395 టవర్లకు 302 పూర్తయ్యాయని, మిగిలిన వాటి పనులు సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. రంపచోడవరం డివిజన్ పరిధిలో 364 టవర్లకు 207 టవర్లు రేడియేషన్ అందిస్తున్నాయని, మిగిలిన 157 టవర్ల నిర్మాణాలను వచ్చే మార్చి నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు.

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నూతన కార్యవర్గం

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కార్యవర్గం ఎన్నిక జరిగింది.సొసైటీ అధ్యక్షుడు,కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అధ్యక్షతన జిల్లా నూతన కార్యవర్గంను ప్రకటించారు. చైర్మన్‌గా జాయింట్ కలెక్టర్ అభిషేక్‌గౌడ, వైస్ చైర్మన్‌గా ఎస్.గంగరాజు, కార్యదర్శిగా జి.గౌరిశంకరరావు, కోశాధికారిగా పి.సూర్యారావు, కార్యవర్గ సభ్యులుగా వి.జయలక్ష్మి, గంగాభవాని, సంజీవరావు, ప్రసాద్‌నాయుడు, సింహాచలం, సుబ్రహ్మణ్యం, డీఆర్‌టీ.పట్నాయక్, శ్రీనివాస్ ఆనంద్ నియమితులయ్యారు.

ఎస్సీ యువతకు స్మార్ట్ మీటర్ టెక్నీషియన్ శిక్షణ

ఎంవీపీకాలనీ(విశాఖ): ఉమ్మడి విశాఖ జిల్లాలోని షెడ్యూల్డ్ కులాల(ఎస్సీ)యువతకు స్మార్ట్ మీటర్ టెక్నీషియన్లుగా ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సత్యపద్మ తెలిపారు. నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (నేక్) సంస్థ ద్వారా ఎస్సీ యువతకు ఈ శిక్షణ అందించనున్నట్లు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 10వ తరగతి, ఐటీఐ ఉత్తీర్ణులైన యువత ఈ ఉచిత శిక్షణకు అర్హులని, శిక్షణ సమయంలో నెలకు రూ.7,500 స్టైఫండ్ కూడా అందజేస్తామన్నారు.వివరాలకు 83090 03957.

ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జెన్‌కో ఉద్యోగుల నిరసన



మోతుగూడెంలో సీఈ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఉద్యోగులు



సీలేరులో జెన్‌కో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఉద్యోగులు



మాచ్‌ఖండ్‌లో ఎస్‌ఈ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ప్రాజెక్టు ఉద్యోగులు

మోతుగూడెం: ఏపీ విద్యుత్ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి పిలుపు మేరకు లోయర్ సీలేరు నందు చీఫ్ ఇంజనీర్ కార్యాలయం వద్ద గురువారం మధ్యాహ్నం భోజన విరామంలో జెన్‌కో ఉద్యోగులు ధర్నా చేశారు. ఉత్తరప్రదేశ్, చండీఘర్ విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తున్నామని వారు పేర్కొన్నారు. ఉద్యోగులు, కార్మిక సంఘం నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

సీలేరు: సీలేరు విద్యుత్ కాంప్లెక్స్ చీఫ్ ఇంజినీర్ కార్యాలయం ఎదుట లోయర్ సీలేరు ఐక్య కార్యచరణ సమితి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సీలేరు కాంప్లెక్స్ సీఐటీయూ బ్రాంచ్ సెక్రటరీ విష్ణుకుమార్, 1104 యూనియన్ సభ్యులు భవాని శంకర్, నాగరాజు,ఏడీఈలు అప్పలనాయుడు, జోగారావు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: విద్యుత్ కేంద్రాల ప్రైవేటీకరణ ప్రక్రియను విరమించాలని గురువారం పేలు కార్మిక సంఘాల ఉద్యోగులు ధర్నా చేశారు. ప్రాజెక్టు ఎస్‌ఈ కార్యాలయం ఎదుట భోజన విరామ సమయంలో నల్ల రిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు.కేంద్ర ప్రభుత్వం విద్యుత్ కేంద్రాల ప్రైవేటీకరణ ఆలోచనను వెంటనే వెనక్కి తీసుకోవాలని నినాదాలు చేశారు.ఈ సందర్భంగా ప్రాజెక్టు కార్మిక సంఘాలకు చెందిన ఉద్యోగులు మాట్లాడుతూ విద్యుత్ కేంద్రాల ప్రైవేటీకరణ చర్యలు నిలుపుదల చేయాలని, లేకుంటే ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.

గంజాయి కట్టడికి ప్రత్యేక వ్యూహం



పాడేరు పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి



సమీక్షిస్తున్న విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి

- మత్తుపదార్థాల దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమాలు
- విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి ఆదేశం

పాడేరు : గంజాయి కట్టడికి ప్రత్యేక వ్యూహం అమలు చేయాలని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి ఆదేశించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం ఆయన ఎస్పీ అమిత్‌బర్దర్‌తో కలిసి స్థానిక పోలీసు స్టేషన్‌ను సందర్శించారు. సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. రికార్డులను తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలను తనిఖీ చేశారు. 2022 నుంచి 2024 వరకు పెండింగ్‌లో కేసుల పురోగతిని, వీటికి సంబంధించిన రికార్డులను నిశితంగా పరిశీలించారు. అనంతరం జిల్లా పోలీసు కాన్ఫరెన్స్‌లో పోలీసు అధికారులు, సీఐలు, ఎస్‌ఐలతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ స్థాయిలో గంజాయి, మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలు, పిల్లల భద్రత, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. గంజాయి కేసుల్లో తప్పించుకు తిరుగుతున్న పాత నేరస్తులను వెంటనే అరెస్ట్ చేయాలన్నారు. గతంలో గంజాయి అక్రమ రవాణాకు పాల్పడి ఆస్తులను కూడగట్టిన వారి జాబితాలను తయారు చేయాలని ఆదేశించారు. వాటిని చట్టప్రకారం జప్తు చేయాలని సూచించారు. గంజాయి కేసుల్లో అరెస్ట్ అయిన ప్రతి ముద్దాయిపై సస్పెక్ట్ షీట్ ఓపెన్ చేయాలన్నారు. వారి ప్రవర్తనను క్షుణ్ణంగా పరిశీలించి మళ్లీ నేరం చేస్తే కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలను అప్రమత్తం చేసేలా అవగాహన కల్పించాలన్నారు. మహిళ భద్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. గ్రామాల్లో ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండాలన్నారు. గ్రామాల్లో జరిగే నేరాలు, అనుమానిత వ్యక్తుల కదలికలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పోలీసు సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీఆర్పీఎఫ్, ఎస్ఏఎస్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కూంబింగ్ ఆపరేషన్ల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాడేరు డీఎస్పీ ప్రమోద్, పాడేరు సీఐ డి. దీనబంధు, ఎస్ఐ సూర్యనారాయణ పాల్గొన్నారు.

వాతావరణ మార్పులతో ఆందోళన

పంటను కాపాడుకోవడంలో నిమగ్నమైన గిరి రైతు

సాక్షి,పాడేరు: బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో గత మూడు రోజుల నుంచి వాతావరణంలో నెలకొన్న మార్పులు గిరి రైతుల్లో గుబులు కలిగిస్తున్నాయి. జిల్లాలో 52 వేల హెక్టార్లలో ఈఏడాది వరి సాగు చేపట్టగా ఇప్పటివరకు 60 శాతం విస్తీర్ణంలో కోతలు పూర్తయ్యాయి. కొన్నిచోట్ల వరిపనలు పొలాల్లో ఉన్నాయి. రెండు రోజుల నుంచి కురుస్తున్న తేలికపాటి వర్షాలకు పంటకు నష్టం జరుగుతోందని రైతులు వాపోతున్నారు.



చట్రాయిపల్లిలో వరి పనలను మోసుకు వస్తున్న గిరి రైతులు

వర్షపాతం వివరాలు

జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. అనంతగిరి మండలంలో అత్యధికంగా 26.4ఎంఎం, జీకే వీధిలో 6.2 ఎంఎం, చింతపల్లిలో 3.8ఎంఎం, మారేడుమిల్లిలో 3.4ఎంఎం, జి.మాడుగులలో 2.6ఎంఎం, కూనవరంలో 2.4ఎంఎం, హుకుంపేటలో 2.6ఎంఎం, చింతూరులో 2.2 ఎంఎం, దేవీపట్నంలో 2 ఎంఎం, అడ్డతీగలలో 2 ఎంఎం, గంగవరంలో 2 ఎంఎం, వై.రామవరంలో 1.6ఎంఎం, పాడేరులో 1.4ఎంఎం వర్షపాతం నమోదయ్యిందని కలెక్టరేట్ అధికారవర్గాలు తెలిపాయి.

పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

చింతపల్లి: మన్యంలో అల్పపీడన ప్రభావంతో రెండురోజులుగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. చలిప్రభావం కూడా తగ్గింది. గురువారం పాడేరు డివిజన్ పరిధిలోని అనంతగిరిలో 17.9, అరకులోయలో18.2, చింతపల్లిలో 18.9 ,డుంబ్రిగుడలో 18.5, జి.మాడుగులలో 18.1, పాడేరులో 19.2, హుకుంపేటలో 19.2, పెదబయలులో19.2, జీకేవీధిలో 19.0, ముంచంగిపుట్టులో 20.0, కొయ్యూరులో 21.1 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు అయినట్టు స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు.

వర్షాలు కురిస్తే తిండి గింజలు కరువే



ప్రస్తుతం అల్పపీడనం వల్ల వాతావరణ మార్పులు ఆందోళనకు గురిచేస్తున్నాయి.తమ ప్రాంతంలో నాతో సహ తోటి గిరిజన రైతులకు చెందిన వరిపంట కోతలు, కట్టల మోత, ధాన్యం నూర్పుడి జరుగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో పంటను కాపాడుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నాం.

– తాంగుల చిట్టినాయుడు, డి.చింతలవీధి, హుకుంపేట మండలం

క్లుప్తంగా

పథకాల అమల్లో సమష్టి కృషి

మహారాణిపేట (విశాఖ): ప్రభుత్వ పథకాల అమలులో శతశాతం చురుకైన పాత్ర పోషించాలని, ఇంటి పన్నులు వసూళ్ల లక్ష్యాలను చేరుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ వీఆర్ కృష్ణతేజ పిలుపునిచ్చారు. గురువారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో విస్తరణ అధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారుల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. పంచాయతీరాజ్ కుటుంబమంతా టీం వర్కుగా పని చేయాలన్నారు. ఉద్యోగుల సమస్యలను కూడా త్వరలో పరిష్కరిస్తామన్నారు. సమావేశంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి పి.నారాయణమూర్తి, డిప్యూటీ సీఈవో కె.రాజ్‌కుమార్, డుమా పీడీ పూర్ణిమాదేవి, జిల్లా పంచాయతీ అధికారి పి.శ్రీనివాసరావు, డీపీఆర్‌సీ ప్రిన్సిపాల్ ఇ.నాగలక్ష్మి, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో కె.రాజ్‌కుమార్, విస్తరణ అధికారులు (పీఆర్‌అండ్‌ఆర్‌డీ), అనకాపల్లి, జిల్లా మండల పరిషత్ అధికారులు పాల్గొన్నారు.

మోతుగూడెంలో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న గ్రామస్తులు

మోతుగూడెం: మోతుగూడెం 327 యూనియన్ కార్యాలయంలో ఏపీ జెన్‌కో , పొల్లూరు, ఇంతులూరు వాగు, ఎంసీడీ క్యాంప్, ప్రభుత్వ ఆస్పత్రిలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాలు ద్వారా 62 యూనిట్ల రక్తం సేకరించినట్టు నిర్వాహకులు తెలిపారు. చింతూరు సీహెచ్‌సీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎంవీ కోటిరెడ్డి ఆధ్వర్యంలో రంపచోడవరం ఆస్పత్రి బ్లడ్‌బ్యాంక్ సహకారంతో నిర్వహించారు.

ఏజెన్సీలో మెరుగైన వైద్య సేవలు

ఏపీ మెడికల్ అండ్ హెల్త్ రాష్ట్ర బృందం

కూనవరం: ఏజెన్సీలోని ప్రభుత్వ ఆస్పత్రులలో మెరుగైన వైద్య సేవలు అందించాలని ఏపీ మెడికల్ అండ్ హెల్త్, హెల్త్‌వెల్ అవేర్నెస్ రాష్ట్ర బృందం సభ్యుడు డాక్టర్ సుబ్రహ్మణ్యం అన్నారు. మండల పరిధిలోని కోతులగుట్ట సీహెచ్‌సీ, కూటూరు, కూనవరం పీహెచ్‌సీలను ఆయన గురువారం ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. సీహెచ్‌సీలో రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి ఆరా తీశారు. స్థానిక ఎన్ఆర్‌సీలో పిల్లల అడ్మిట్, అందిస్తున్న పౌష్టిక ఆహారం తదితర విషయాలను సూపరింటెండెంట్ డాక్టర్ మహేష్ బాబును అడిగి తెలుసుకున్నారు. ఎన్ఆర్‌సీలో వైద్యాధికారితో పాటు ఖాళీగా ఉన్న వైద్య సిబ్బంది పోస్టులు భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే ఆస్పత్రిలో నెలకు ఎన్ని డెలివరీలు జరుగుతున్నాయని ఆరా తీశారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఆస్పత్రిలో రోగులకు కావాల్సిన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం కూనవరం పీహెచ్‌సీని సందర్శించి ప్రజలకు అందుతున్న వైద్యసేవల గురించి డాక్టర్ సునీల్, రాజీవ్‌లను అడిగి తెలుసుకున్నారు. స్టాఫ్‌నర్సుల కొరత ఉన్నట్టు వారు తెలియజేయగా, భర్తీ చేసేందుకు చర్యలు చేపడతామన్నారు. అనంతరం డాక్టర్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ గ్రామాల్లో ఆశ కార్యకర్తలు ప్రజలకు మంచిగా సేవలందిస్తున్నారని ప్రశంసించారు. రాష్ట్ర బృందాన్ని స్థానిక నాయకులు ఆవుల మరియాదాసు, దీకొండ గంగాధర్‌లు కలిసి సీహెచ్‌సీ ద్వారా 24/7 సేవలు అందించాలని కోరారు. బృందం సభ్యురాలు డాక్టర్ శాంతి, సీహెచ్‌సీ వైద్యులు గైనకాలజిస్టు పి.శ్వేత, డాక్టర్ సి.తేజ, డాక్టర్ ప్రజ్వల, హెడ్ నర్స్ బి.బుజ్జి, ఫార్మసిస్టు తుష్టి జోగారావు, దేవీ ప్రసన్న, సుబ్బారావు, ఇందు, అనసూయ, రమేష్ తదితరులున్నారు.



జడ్డంగి పీహెచ్‌సీలో ఓ గర్భిణి ఆరోగ్య పరిస్థితిని పరిశీలిస్తున్న జేడీ రత్నావళి

రాజవొమ్మంగి: మండలంలోని జడ్డంగి, రాజవొమ్మంగి, లాగరాయి పీహెచ్‌సీలను రాష్ట్ర మహిళా శిశు ఆరోగ్య విభాగ జేడీ రత్నావళి గురువారం ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. పీహెచ్‌సీల్లో డెలీవరీలు, అందుతున్న వైద్య సేవలు తదితర అంశాలను ఆరా తీశారు. గత ఆరునెలలలో జరిగిన ప్రసవాల రిజిస్టర్‌ను పరిశీలించారు. పీహెచ్‌సీల్లో ప్రసవాలు తగ్గిపోడానికి కారణాలపై ఆరా తీశారు. జడ్డంగి పీహెచ్‌సీలో చక్రవేణి అనే గర్భిణికి హెచ్‌బీ తక్కువగా ఉన్నట్టు గుర్తించి వైద్యాధికారులకు అవసరమైన సూచనలు ఇచ్చారు. జడ్డంగి పీహెచ్‌సీలో మరుగుదొడ్లు శుభ్రంగా లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ఆపరేషన్ థియేటర్‌లో ఆటో క్లావ్ మెషీన్, గ్రీన్ క్లాత్‌లు, నేమ్‌బోర్డ్స్ ఎందుకు లేవని సిబ్బందిని ప్రశ్నించారు. జడ్డంగి పీహెచ్‌సీ చుట్టు అసంపూర్తిగా ఉన్న ప్రహరీ, నైట్ వాచ్‌మాన్ లేకపోవడం, సిబ్బంది క్వార్టర్స్ లేకపోవడం వంటి పలు సమస్యలు గుర్తించామని, ఉన్నతాధికారులకు నివేదిస్తామని విలేకరులతో ఆమె చెప్పారు. జడ్డంగి, లాగరాయి పీహెచ్‌సీలకు బర్త్ వెయిటింగ్ రూమ్స్ లేవని పలువురు స్థానికులు ఆమెకు విన్నవించారు. ఆశ వర్కర్ల పనితీరును మెచ్చుకొన్నారు. ఏఎన్‌ఎం తదితర పోస్టుల భర్తీకీ చర్యలు తీసుకొంటామన్నారు. ఆమె వెంట డబ్ల్యూహెచ్‌ఓ ప్రతినిధి ప్రహర్ష, పీహెచ్‌సీ వైద్యాధికారులు యామిని ప్రియదర్శిని, నాగార్జున, సుష్మ తదితరులున్నారు.

రహదారి నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

వై.రామవరం: రహదారి కోసం ఆదివాసీ చైతన్య వేదిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి నాలుగో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు వెదుళ్ల లచ్చిరెడ్డి మాట్లాడుతూ మండల ఎగువ ప్రాంతమైన గుర్తేడు, పాతకోట గ్రామాల వరకు ఈ రోడ్డు నిర్మిస్తే జిల్లాలోనే అతిపెద్ద విస్తీర్ణం గల వై.రామవరం మండలాభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. అంతే కాకుండా రాష్ట్రంలోని విశాఖ తదితర జిల్లాలతో పాటు, చత్తీస్‌గఢ్, ఒడిశా, తెలంగాణ తదితర రాష్ట్రాలకు ప్రధాన రహదారి ఏర్పడుతుందన్నారు. అటవీశాఖ అడ్డంకులతో నిలిచిపోయిన రోడ్డు నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమైనట్టు చెప్పారు.

ఈ రహదారి కోసం గత నాలుగు రోజులుగా దీక్షలు చేస్తున్నా ఇంతవరకు అధికారులు, యంత్రాంగం కనీసం స్పందించకపోవడం దారుణమన్నారు.



దీక్షలో మాట్లాడుతున్న ఆదివాసీ జిల్లా చైతన్య వేదిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు లచ్చిరెడ్డి

గిరిజనుల న్యాయపరమైన కోర్కెలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఈ రోడ్డుతో పాటు మండలంలోని మారుమూల గ్రామాలకు రోడ్లు, కొండవాగులపై వంతెనలు నిర్మించి, డోలీ మోత కష్టాల నుంచి ఆదివాసీలను విముక్తి చేయాలని కోరారు. సమస్యపై ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. నేతలు వెంకటేశ్వర్లు, త్రిమూర్తులు, నరసన్నదొర, ప్రసాదు, లక్ష్మణరావు, చిన్నారావు, గంగరాజు, శారద, పండురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి రవాణా అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు

చింతపల్లి: ఏజెన్సీలో గంజాయి సాగు రవాణాను పూర్తిస్థాయిలో అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని డీఎస్పీ షేక్ షెహబాజ్ అహ్మద్ అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఆయన గురువారం ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులను తనిఖీ చేశారు. పోలీసులకు పలు సూచనలు చేశారు. ఒడిశా ప్రాంతంలో పండించిన గంజాయి పంటను ఈ ప్రాంతం మీదుగా మైదాన ప్రాంతానికి తరలిస్తున్న నేపథ్యంలో దానిని పూర్తిగా నిర్మూలించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. గ్రామ స్థాయిలో నిఘా వ్యవస్థను పటిష్టం చేయలన్నారు. చింతపల్లిలో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. వారపు సంత రోజున వాహనాల రద్దీ ఎక్కువున్న నేపథ్యంలో వాహనాలను టౌన్ లోనికి రాకుండా కట్టడి చేయాలని సూచించారు. వాహనాలు సక్రమంగా పార్కింగ్ ఉండేలా దుకాణ యజమానులకు ముందుగానే హెచ్చరికలు జారీ చేయాలన్నారు. సీఐ వినోద్‌బాబు, ఎస్ఐ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



చింతపల్లి పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ షేక్ షహబాజ్ అహ్మద్

కొత్తపల్లి జలపాతాన్ని సందర్శించిన ఐటీడీఏ పీవో

జి.మాడుగుల: కొత్తపల్లి జలపాతం వద్ద సుందరీకరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ ఆదేశించారు. మండలంలో కొత్తపల్లి జలపాతాన్ని బుధవారం రాత్రి ఆకస్మికంగా సందర్శించారు. ఇక్కడ జరుగుతున్న పనులు, గార్డెన్ ఆధునీకరణ పనులను వివిధ శాఖల అధికారులతో ఆయన పరిశీలించారు.

ఇక్కడున్న వ్యూపాయింట్ నుంచి జలపాతం ప్రకృతి అందాలను వీక్షించారు. అరకు పద్మాపురం గార్డెన్ మేనేజర్ బొంజుబాబు పర్యవేక్షణలో జలపాతం సమీపంలో డివైడర్ వద్ద రోడ్డు కిరువైపులా, టికెట్ కౌంటర్ సమీపంలో, ఖాళీ స్థలాల్లో మొక్కలను నాటారు.



కొత్తపల్లి జలపాతం అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్

నిరుద్యోగులకు ప్లంబింగ్‌లో శిక్షణ

మహారాణిపేట(విశాఖ): నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్(నేక్) సంస్థలో నిరుద్యోగులకు ఉచితంగా ప్లంబింగ్ శిక్షణ అందిస్తున్నట్లు నేక్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్‌వీఎస్ఎస్ రవికుమార్ తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా అందిస్తున్న ఈ శిక్షణకు పదో తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులన్నారు. 18 నుంచి 45 ఏళ్ల వయసు ఉన్న వారు ఈ మూడు నెలల కో ర్సుకు దరఖాస్తు చేసుకోవాలని, ఇతర వివరాలకు 85005 02395 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. ప్రధాన మంత్రి కౌశ ల్ వికాస్ యోజన 4.0 పథకం కింద ఈ ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు వివరించారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

పాడేరు : విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని, ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి విద్యార్థికి ప్రత్యేక స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్టు జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ జమల్‌బాషా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 64 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని 3,214 అంగన్‌వాడీ కేంద్రాల్లో 1,01,633 మంది పిల్లలున్నట్టు చెప్పారు. 3,124 ఎంపీపీ, ఎంపీయూపీ, జిల్లా పరిషత్, ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలలు, వసతి గృహాల్లో 1,99,993 మంది విద్యార్థులున్నట్టు తెలిపారు. ఈ మేరకు పీహెచ్‌సీ పరిధిలో ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు సంయుక్తంగా ప్రతి గురువారం పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్నం 2 నుంచి 4గంటల వరకు, అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ప్రతి శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. పిల్లల్లో ఎవరైనా అనారోగ్యంగా ఉంటే వారిని వెంటనే సమీపంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించాలని సూచించారు. స్క్రీనింగ్ పరీక్షల్లో ఆరోగ్య క్షీణత ఉన్న పిల్లలను పాడేరు జిల్లా ఆస్పత్రి, రంపచోడవరం ఏరియా ఆస్పత్రులకు తరలించాలని ఆదేశించారు. పిల్లలను ఆస్పత్రులకు తరలించేందుకు వాహన సదుపాయం సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 1532 అంగన్వాడీ కేంద్రాల్లో 34,501 మంది పిల్లలకు , 3,124 పాఠశాలల్లో 93,264 మంది పిల్లలకు స్క్రీనింగ్ చేశామన్నారు. అందరికీ మార్చి 31లోగా స్క్రీనింగ్ పరీక్షలు పూర్తి చేస్తామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ జమల్‌బాషా స్పష్టం చేశారు.

రెవెన్యూ సదస్సులతో సమస్యల పరిష్కారం

- డీఆర్‌డీఏ పీడీ మురళి

పాడేరు రూరల్ (అరకులోయ రూరల్): రెవెన్యూ సదస్సులతో ప్రజల సమస్యలు పరిష్కారం సాధ్యపడుతుందని మండల ప్రత్యేక అధికారి, డీఆర్‌డీఏ పీడీ మురళి తెలిపారు. మండలంలోని తుపాడ గ్రామ సచివాలయంలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో మాట్లాడారు. భూసమస్యలు, మ్యుటేషన్, కులధ్రువీకరణ పత్రాలు వంటి సమస్యలపై దరఖాస్తు చేసుకోవచ్చునని సూచించారు. వివిధ సమస్యలకు సంబంధించి 138 వినతులు స్వీకరించినట్టు ఆయన వివరించారు. తహసీల్దార్ త్రినాథరావు, సర్పంచ్ సూర్యకాంతాం, ఎంపీటీసీ నర్సింహమూర్తి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ మురళి

అక్రమ కేసులు నిలిపివేయాలని వినతి

సీలేరు: గంజాయి పేరుతో పోలీసులు పెడుతున్న అక్రమ కేసులు నిలిపివేయాలని కోరుతూ కలెక్టరు ఎఎస్ దినేష్‌కుమార్‌కు సీపీఐ జిల్లా కమిటీ సభ్యులు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు సిపిఐ జిల్లా కార్యవర్గసభ్యుడు ఎస్ విష్ణుమూర్తి ఆధ్వర్యంలో సిపిఐ నాయకులు కలెక్టరును కలిశారు.ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు విష్ణుమూర్తి మాట్లాడుతూ జిల్లాలో గూడెం కొత్తవీధి మండలం దారకొండ, దుప్పులవాడ గుమ్మిరేవుల పంచాయతీలో పలు గ్రామాల్లో గంజాయి రవాణాకు ఎటువంటి సంబంధం లేదని అమాయక గిరిజన యువతపై పోలీసులు అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆయన ఆరోపించారు.ఈ నెల 13న గుమ్మిరేవుల పంచాయతీ నేలజర్తకు చెందిన బుజ్జిబాబు ఇంటికి రంపచోడవరం పోలీసులు వ్యవసాయ అధికారులమని చెప్పి బలవంతంగా తీసుకెళ్లారని, దారకొండ పంచాయతీ చిలకమామిడి గ్రామానికి చెందిన నారాయణరావును గుంటరాజు కోసం అడిగి బలవంతంగా మారెడుమిల్లి పోలీసులు తీసుకెళ్లారని వివరించారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి గంజాయి కేసుల్లో అమాయక గిరిజన యువతని భాగస్వామ్యం చేయొద్దని, వారి భవిష్యత్తును కాపాడాలని కోరారు. ఎంటీయూసి కో కన్వీనర్ అమర్ తదితరులున్నారు.



కలెక్టర్ దినేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

అమిత్‌షా వ్యాఖ్యలపై ధ్వజం

పాడేరురూరల్(అరకులోయరూరల్): భారత నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్‌పై పార్లమెంట్‌లో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలు చేయడం దారుణమని, తక్షణమే పదవికి రాజీనామా చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు సాగిన ధర్మనపడాల్, ప్రధాన కార్యదర్శి బాలదేవ్ డిమాండ్ చేశారు. వారు గురువారం విలేకరులతో మాట్లాడుతూ బాధ్యత గల హోం శాఖ కేంద్ర మంత్రి పదవిలో ఉన్న వ్యక్తి రాజ్యాంగ నిర్మాత, బడుగుల అభ్యున్నతికి విశేష కృషి చేసిన మహనీయుడు అంబేద్కర్‌పై చేసిన వాఖ్యలు మత విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా ఉన్నాయన్నారు. దీనిపై కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే తక్షణమే అమిత్‌షాపై కఠినమైన చర్యలు తీసుకోవాలన్నారు. అమిత్‌షా చేసిన తప్పుడు వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని, తక్షణమే మంత్రి పదవికి రాజీనామ చేసి రాజకీయాల నుంచి తప్పుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో దేశ ప్రజల నుంచి తగిన గుణపాఠం తప్పదన్నారు.



మాట్లాడుతున్న ఆదివాసీ గిరిజన సంఘం నేతలు బాలదేవ్, ధర్మన పడాల్

21న ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అరకు పర్యటన

అనంతగిరి (అరకులోయ టౌన్): రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఈనెల 21న అరకులోయ పర్యటనలో భాగంగా అనంతగిరి మండలంలోని పినకోట పంచాయతీ బల్లగరువు గ్రామంలో జరగనున్న కార్యక్రమం ఏర్పాట్లను ఐటీడీఏ పాడేరు పీవో వి.అభిషేక్ గురువారం పర్యవేక్షించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన గురువారం అనంతగిరిలో పర్యటించారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పర్యటనలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు, ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఆయనతో పాటు సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, ఈఎస్పీ ప్రమోద్‌కుమార్ , పీఆర్ ఈఈ కొండయ్యపడాల్, ఎంపీడీవో కుమార్, ఇన్‌చార్జి తహసీల్దార్ మాణిక్యం తదితరులున్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో అభిషేక్

వినియోగదారుల చట్టాలపై అవగాహన

రంపచోడవరం: జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని రంపచోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వాణిజ్య విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా.కె వసుధ మాట్లాడుతూ విద్యార్థులు వినియోగదారుల చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. సైబర్ నేరాలు, ఆన్‌లైన్ లావాదేవీల్లో జరుగుతున్న మోసాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులు ఏర్పాటుచేసిన స్టాల్స్‌ను ప్రారంభించారు. ఆయా స్టాల్స్‌లో ఉత్తమమైనవి గుర్తించి, ప్రథమ బహుమతిగా రూ.2వేలు, ద్వితీయ బహుమతిగా రూ. 1500, తృతీయ బహుమతిగా రూ.1000లను కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన న్యాయవాది సత్యనారాయణ చేతుల మీదుగా అందజేశారు.

కిర్రాక్ ఫీచర్లతో వీవో ఎక్స్200 సిరీస్

డాబాగార్డెన్స్: ప్రముఖ మొబైల్ రిటైల్ సంస్థ సెల్‌పాయింట్ ఇండియా వీవో ఎక్స్ 200 సిరీస్‌ను గురువారం లాంఛనంగా ప్రారంభించింది. డాబాగార్డెన్స్‌లోని సెల్‌పాయింట్ షోరూంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంస్థ చైర్మన్ మోహన్ ప్రసాద్ పాండే ఆధ్వర్యంలో ఎమ్మెల్యేలు పీజీవీఆర్ నాయుడు(గణబాబు), వంశీకృష్ణ శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా ఈ మొబైల్ ఫోన్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ ఏ కంపెనీ కొత్త మొబైల్ ఫోన్లను విడుదల చేసినా అవి ముందుగా సెల్‌పాయింట్‌లోనే అందుబాటులోకి వస్తాయన్నారు. నగరంలో సెల్‌పాయింట్ సెల్‌ఫోన్లకు అడ్డాగా మారిందని, వీవో ఎక్స్ 200 సిరీస్ మంచి ఫీచర్లతో మార్కెట్లోకి విడుదలైందన్నారు. వంశీకృష్ణ మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా ఈ సిరీస్‌ను రూపొందించారన్నారు. ఎంతో మందికి ఉపాధి కల్పిస్తున్న సెల్‌పాయింట్ అధినేతను ఆయన అభినందించారు. చైర్మన్ మోహన్‌ప్రసాద్ పాండే మాట్లాడుతూ విశాఖపట్నంలో తొలిసారిగా డైమండ్ పార్క్ వద్ద సెల్‌పాయింట్‌ను ప్రారంభించామని, ప్రస్తుతం విశాఖలో 29, రాష్ట్ర వ్యాప్తంగా 82 స్టోర్లకు విస్తరించడం సంతోషంగా ఉందన్నారు. వీవో ఎక్స్200 సిరీస్‌లో అత్యాధునిక ఫీచర్లు ఉన్నాయని, ముఖ్యంగా కెమెరా, బ్యాటరీ, డిస్‌ప్లే వంటి వాటిపై కంపెనీ ప్రత్యేక శ్రద్ధ తీసుకుందన్నారు. వీవో ఎక్స్ 200 సిరీస్ కొనుగోలుపై ఉచితంగా హ్యాపీ పోలా 100 వాట్స్ సౌండ్‌బార్, వీవో బడ్స్ టీడబ్ల్యూఎస్ 3ఈ ఏఎన్‌సీ అందిస్తున్నట్లు తెలిపారు. మరికొన్ని ఉత్పత్తులపై రూ.20 వేల వరకు డిస్కౌంట్ ఇస్తున్నట్టు వెల్లడించారు. భాగస్వామ్య బ్యాంకుల ద్వారా 10 శాతం వరకు క్యాష్‌బ్యాక్, శాంసంగ్, ఎంఐ, ఎల్‌జీ, సోనీ, హైయర్, ఏసర్ వంటి టాప్ బ్రాండ్లపై 50 శాతం వరకు డిస్కౌంట్, యాక్సరీస్‌పై 60 శాతం డిస్కౌంట్ అందిస్తున్నట్లు వివరించారు. సెల్‌పాయింట్ ప్రతినిధి బాలాజీ పాండే, వీవో సంస్థ ప్రతినిధి సతీష్ పాల్గొన్నారు.



వీవో ఎక్స్ 200 సిరీస్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు గణబాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, సెల్‌పాయింట్ ఇండియా చైర్మన్ మోహన్‌ప్రసాద్ పాండే, బాలాజీ పాండే

వన్యప్రాణులను సంరక్షించుకోవాలి

సీలేరు: దుప్పులవాడం పంచాయతీ బూసుకొండ గ్రామంలో అటవీశాఖ అధికారులు గురువారం పర్యటించారు. గ్రామస్తులకు అడవిలో అగ్ని-నివారణ, వన్యప్రాణుల సంరక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ అధికారి సీహెచ్.సింహాచల పడాల్ మాట్లాడుతూ అడవిలో అగ్నిప్రమాదాల వలన విలువైన వృక్ష సంపద నాశనమవుతుందని, భూసారం దెబ్బతింటుందని, వన్యప్రాణుల మనుగడ కష్టమవుతుందన్నారు. అడవుల్లో కార్చిర్చు వల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందని గ్రామస్తులకు వివరించారు. అడవుల్లో అగ్ని ప్రమాదాలు జరిగినపుడు బాధ్యతగా మంటలను ఆర్పే ప్రయత్నం చేయాలన్నారు. సీలేరు రేంజ్ బీట్ అఫీసర్ ఆర్ రాకేష్ కుమార్, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ దుర్గాప్రసాద్ , దుప్పులవాడ మాజీ సర్పంచ్ చెల్లయమ్మ, ఫారెస్టు సిబ్బంది పాల్గొన్నారు.



గ్రామస్తులతో అటవీశాఖ అధికారులు

స్వర్ణ వస్త్రాలంకరణలో కన్యకాపరమేశ్వరి

డాబాగార్డెన్స్ (విశాఖ): మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా విశాఖ కురుపాం మార్కెట్ సమీపాన గల కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని స్వర్ణ వస్త్రాలంకరణలో అలంకరించారు. మూడో గురువారాన్ని పురస్కరించుకుని మూల విరాట్‌కు ప్రాత:కాల ప్రత్యేక పూజల అనంతరం అమ్మవారికి 108 స్వర్ణ పుష్పాలతో అర్చన చేశారు. వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. సామూహిక లలితా సహస్రనామ పారాయణ, సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. అమ్మవారికి ప్రీతిపాత్రమైన గోమతి చక్రాలతో ప్రత్యేక పూజలు జరిపారు. కార్యక్రమంలో దేవాలయ సంఘం అధ్యక్షుడు ఆరిశెట్టి దినకర్, కార్యదర్శి పెనుగొండ కామరాజు, కోశాధికారి డీవీ బాలాజీకుమార్, ప్రధాన అర్చకుడు ఆర్‌బీబీ కుమార్ శర్మ, ఉత్సవ కమిటీ సభ్యులు బాదం నాగ వెంకట కమలశ్రీ, కట్టమూరి ప్రసన్న, కడిమిశెట్టి దంతేశ్వరి, గ్రంధి దేవి, పాలూరి స్వర్ణలత, కొల్లూరు విశాల, గ్రంథి ఉష, కందుల గీతా ఆదిలక్ష్మి, పసుమర్తి హైమావతి, అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో కన్యకాపరమేశ్వరి



సామూహిక కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు

4న విశాఖ వేదికగా నేవీ విన్యాసాలు

- హాజరుకానున్న ముఖ్యమంత్రి చంద్రబాబు
- ఏర్పాట్లపై కలెక్టర్ హరేందిర ప్రసాద్ సమీక్ష



నేవీ విన్యాసాల ఏర్పాట్లను సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేందిరప్రసాద్

మహారాణిపేట: జనవరి 4న విశాఖ వేదికగా నిర్వహించనున్న నావికాదళ విన్యాసాల ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ గురువారం సమీక్షించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన అధికారులకు పలు సూచనలిచ్చారు. సీఎం చంద్రబాబునాయుడు హాజరుకానున్న నేపథ్యంలో అన్ని రకాల భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా బారికేడ్లు, మొబైల్ టాయిలెట్లు, తాగునీటి సదుపాయం, వేడుకలను ఎక్కడికక్కడ తిలకించేలా భారీ ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేయాలని సూచించారు.

4న లేజర్, డ్రోన్ షో: విన్యాసాలు నిర్వహించే జనవరి 4న సాయంత్రం ఆర్కే బీచ్‌లో ఓపీ డెమోతో పాటు లేజర్ షో, డ్రోన్ షో, నౌకల పైనుంచి విన్యాసాలు కూడా ఉంటాయని నేవీ అధికారులు తెలిపారు. 2న ఫుల్ రిహార్సల్స్ నిర్వహిస్తామన్నారు. నేవీ తరపున కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని, జిల్లా యంత్రాంగం సహకారించాల్సిందిగా కోరారు. సమీక్షలో జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్ కుమార్, వీఎంఆర్డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్, డీసీపీ అజిత, నేవీ కమాండర్లు వై.కె.కిషోర్, మనోజ్‌కుమార్, లెఫ్టినెంట్ కమాండర్లు సంజిబ్ శరణ్, ఉజైర్ కుస్రో, డీఆర్వో బీహెచ్ భవానీశంకర్, ఇతర విభాగాల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.